క్లుప్తంగా

దుర్గాకాలనీ దారి తెరిపించండి

జనగామ: పట్టనంలోని సూర్యాపేటరోడ్డులోని దుర్గాకాలనీ దారిని తెరిపించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ అధికారులు గత కొన్ని నెలల క్రితం కాలనీ దారి మూసి వేయడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పిల్లలను స్కూల్‌కు పంపించడంతోపాటు ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న దారిలో గుంతలు ఏర్పడడం, ఇతర సమస్యలతో నరకం అనుభవిస్తున్నామని, వెంటనే సమస్యకు దారి చూపించాలని కోరారు.

నేడు చిన్నారులకు స్వర్ణ ప్రాశం పంపిణీ

జనగామ: పుష్యమి నక్షత్రం పర్వదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్‌నెస్ సెంటర్‌లో నేడు(ఆదివారం) 0 నుంచి 16 ఏళ్ల పిల్లలకు ఉచితంగా స్వర్ణ ప్రాశం లిక్విడ్‌ను పంపిణీ చేయనున్నట్లు ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు స్వర్ణపాశం అందించనున్నట్లు తెలిపారు. పిల్లలను పరిగడుపున తీసుకురావాలన్నారు.

నేడు దుర్గమ్మ పండుగ నిర్వహణపై సమావేశం

పట్టణంలోని బతుకమ్మకుంట శ్రీవిజయదుర్గా మాత దేవాలయంలో దుర్గమ్మ పండుగ నిర్వహణకు సంబంధించిన తేదీల ఖరారు కోసం అన్ని కుల సంఘాల పెద్దలతో నేడు (ఆదివారం) సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. విజయమాత దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు, కులసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మాత్రమే హాజరుకావాలన్నారు. అలాగే వార్డు కౌన్సిలర్లు, ప్రముఖ రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, ఉదయం 10 గంటలకు దుర్గామాత దేవాలయంలో జరిగే సమావేశానికి రావాలన్నారు.

సేవారత్న అవార్డుకు పృథ్వీ ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండలం తానేదార్ పల్లికి చెందిన గాదె పృథ్వీ 2023 సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపికైె నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ శనివారం ప్రకటించారు. బహుజన వర్గాల ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులను గుర్తించి ప్రతి ఏడాది అవార్డులు అందజేస్తున్నామని, విద్యావంతుడు, యువనాయకుడు పృథ్వీ కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 15న ఢిల్లీలో అవార్డు అందజేస్తారని తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



రఘునాథపల్లి: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్ అన్నారు. శనివారం ఆయన మనుమడు రిత్విక్ జన్మదినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బెల్టులు, టైలు, బ్యాడ్జీలు బహూకరించారు. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు అయిత జయరాములు, గౌరవ అధ్యక్షుడు బచ్చు చిరంజీవులు, ఓరుగంటి శంకర్‌లింగం, కూరెళ్ల వేద కుమార్, వినయ్‌కుమార్, సోమేశ్వర్, గందె లిరిల్, మణికంఠ, వెంకటరమణ పాల్గొన్నారు.

చేయూత

నర్మెట: మండలకేంద్రంలో తమకు ప్రభుత్వం కేటాయించిన మూడెకరాల భూమిలో తాటి, ఈత వనాల పెంపకం కోసం నీటివసతి కల్పించాలని నర్మెట కల్లుగీత కార్మికులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డిని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన బోరు, మోటారు నిమిత్తం ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ కన్వీనర్ పెద్దిరాజి రెడ్డి ద్వారా రూ.1.50 లక్షలు శనివారం సంఘం నాయకులకు అందించారు. జెడ్పీ కోఆప్షన్ గౌస్, సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేష్, నక్కల రవి, రమేష్, తిరుపతి గౌడసంఘం సభ్యులు గోపగాని యాదగిరి పాల్గొన్నారు.

రైతు ఉద్యమానికి సిద్ధం కావాలి

పాలకుర్తి: దేశ వ్యాప్తంగా మరో రైతు ఉద్యమానికి సిద్దంగా కావాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులు రాపర్తి సోమయ్య, భూక్యా చందు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాగర్ మాట్లాడారు. మాచర్ల సారయ్య, మంగ బీరయ్య, రామావత్ మీట్యానాయక్, పనికి రాజు, బచ్చు శ్రీలత, రాజవ్వ,పుల్లయ్య, చిట్యాల సోమన్న, సోమ సత్యం పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



బచ్చన్నపేట: అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి



చిల్పూరు: ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బచ్చన్నపేట: వచ్చే ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కలెక్టర్, పౌర సంబంధాల శాఖ అధికారి సూచనల మేరకు ఓటుహక్కు వినియోగంపై కళాజాతా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటును డబ్బుకు అమ్ముకోవద్దని, దాని ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, అందుకే అందరూ తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు. కళాకారులు గణేష్, కనకరాజు, సంజీవ, రత్నం, శంకర్, శ్రీనివాస్, స్వప్న, పద్మ చామంతి, ఓటర్లు ఉన్నారు.

ఓటుహక్కు ప్రాముఖ్యతపై కళాజాతా

చిల్పూరు: ఓటర్లకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సరస్వతి అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వీప్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించగా సర్పంచ్ రాజ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఓటు హక్కు ప్రాముఖ్యత, కొత్త ఓటర్లకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కొడకండ్ల: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కొడకండ్ల: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏసీపీ రఘుచందర్ అన్నారు. శనివారం జనగామ–సూర్యాపేట హైవేపై గిర్నితండా వద్ద ఏసీపీ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ సీపీ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల ఎస్సైలు శ్రావణ్‌కుమార్, శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్, పోలీసుల వాహనాల తనిఖీ

రఘునాథపల్లి: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో ఎక్సైజ్, పోలీసులు నిఘా పెంచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని కోమళ్ల టోల్ ప్లాజా వద్ద వేర్వేరుగా వాహనాలు తనిఖీ చేశారు. ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, జనగామ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల తనిఖీలో ఎలాంటి నిషేధిత పదార్థాలు, మద్యం లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. అదే విధంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథపల్లి, లింగాలఘణపురం ఎస్సైలు టోల్ ప్లాజా వద్ద వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేశారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

బచ్చన్నపేట: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కంకల సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ బదే రాజు, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, జమాల్, రాకేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో బహుళ ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న సావిత్రి

దేవరుప్పుల: జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా షాతోనే పల్లె ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపురం, కోలుకొండ తదితర గ్రామాల్లో ఉపాధి పనులపై ఆడిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా వ్యవసాయరంగాభివృద్ధితోపాటు కూలీలకు కనీస దినసరి కూలివేతనం వస్తుందన్నారు. ఏ గ్రామాల్లోనైతే ఉపాధి పనులు ఎక్కువ చేపడితే ఆ గ్రామాలకు మరిన్ని నిధులు వస్తాయన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వర్, సర్పంచ్‌లు రెడ్డిరాజుల రమేష్, కూర్నాల రవి, ఆడిట్ పర్యవేక్షకులు భద్రు, ఆడిట్ ఆఫీసర్ రాజు, ఉపాధి హామీ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచిత అల్పాహార వితరణకు 100 రోజులు



జనగామ: చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ(ఎంసీహెచ్) హాస్పిటల్ ఆవరణలో లయన్స్ జిల్లా 320ఎఫ్ 6–7 ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమం శనివారంతో 100వ రోజుకు చేరుకుంది. లయన్ జిల్లా గవర్నర్ ఎన్ వెంకటేశ్వరరావు సహకారంతో కో ఆర్డినేటర్ జైన రమేష్ ఆధ్వర్యంలో ప్రతిరోజు 300 మందికి ఉచిత అల్పాహారం అందిస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉచిత అల్పాహార విందు కార్యక్రమంలో అనేక మంది సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. అమెరికా, ఏపీలోని కాకినాడ నుంచి సైతం దాతలు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్లు రాజశేఖర్ రెడ్డి, రాపాక విజయ్, పూర్వ జిల్లా గవర్నర్లు కన్నా పరశురాములు, కాసం అంజయ్య, డాక్టర్ లవకుమార్ రెడ్డి, జాన్ బన్నీ గారు, ప్రసాద్ రావు, అంబటి రాజయ్య, నల్ల యాదగిరి పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తొలగించాలి

- స్వేరో స్టూడెంట్ నాయకుల డిమాండ్



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: విద్యార్థుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా తయారు చేస్తున్న టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తక్షణమే తొలగించాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా జోన్ అధ్యక్షుడు మారెపెల్లి మనోజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మాదారపు విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్‌సీ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్కారు కొలువు వస్తుందనే ఆశతో అప్పులు చేసి ఏళ్ల తరబడి కోచింగ్‌లకు వెళ్లిన నిరుద్యోగుల ఆశలు అడియాశలవుతున్నాయని అన్నారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ చేపట్టి మోగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, అభిగౌడ్, పవన్, నరేష్, స్వాతి, పారి జాత, సందీప్ పాల్గొన్నారు.

ఆంగ్లంలో మాట్లాడటం ఒక కళ



స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణలో పాల్గొన్న శ్రీధర్

జనగామ రూరల్: ఆంగ్లం నేర్చుకోవడం ఒక భాగం అయితే మాట్లాడటం ఒక కళ అని రచయిత వారణాసి శ్రీధర్ అన్నారు. శనివారం పెంబర్తిలోని బీసీ మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో ఎం.నిరోషా ఆధ్యక్షతన స్పోకెన్ ఇంగ్లిష్ తరగుతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే అంగ్ల భాషా పరిజ్ఞానం అనివార్యం అన్నారు. ఇంగ్లిష్ బాషలో ఎలాంటి మేళకువలు పాటించాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ఎన్ చారి, అనూష, రజిని, సౌమ్య, కవిత, ప్రేమలత, ఆశాలత, అఖిల, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యం స్థాపిద్దాం

పాలకుర్తి టౌన్: పోరాట యోధుల స్ఫూర్తితో బహుజన రాజ్యం స్థాపిద్దామని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోయిని చంద్రశేఖర్ అన్నారు. బహుజన వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి శనివారం పూలమాలవేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ ఇంటి నుంచి పిడికెడు మట్టిని సేకరించారు. అనంతరం విస్నూరులో ఆరూర్తి సుధాకర్ ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. 1200 మంది అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందని అన్నారు. బీఆర్ అంబేడ్కర్ వారసత్వాన్ని పునికిపుచ్చుకొని కాన్సీరాం కలలు కన్న బహుజన రాజ్యాధికారాన్ని సాధించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సమష్టిగా పోరాడడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి, పార్లమెంట్ కొఆర్డినేటర్ నీర్మాల రత్నం, యాదగిరి, బాబు, ప్రశాంత్, సంపత్, రమేష్, అశోక్ ఉన్నారు.

ఇరిగేషన్ ఏఈపై ఆగ్రహం



ఇరిగేషన్ ఏఈ యాసర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రవి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ శివారు నారాయణలొద్ది కుంట కట్ట ధ్వంసం విషయమై ఇరిగేషన్ ఏఈ యాసర్‌పై మండల సభలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ కందుల రేఖగట్టయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా రవి హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ అనివార్యకారణాలతో రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరైనా ఎంపీపీ చాంబర్‌లో ఎంపీటీసీలు సమావేశమై మండల సభను ఆలస్యంగా ప్రారంభించారు. దాంతో అధికారులు అసౌకర్యానికి గురయ్యారు. మండల సభలో వివిధ శాఖల అధికారులు తమ నివేదిలను వినిస్తుండగా ఇరిగేషన్ అంశంపై ఏఈ యాసర్ మాట్లాడుతుండగా నారాయణలొద్ది కుంట విషయమై జెడ్పీటీసీ ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో కుంట కట్టతోపాటు పూర్తిగా కుంటనే లేకుండా చేశారని, ఈ విషయమై వివరణ చెప్పాలని కోరగా ఏఈ సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఆగ్రహించిన జెడ్పీటీసీ ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అనంతరం వివిధ శాఖల నివేదికలను అధికారులు నివేదికలు చెబుతుండగా గ్రామాల్లో గుడుంబాను, బెల్ట్‌షాపులను నివారించాలని నమిలిగొండ ఎంపీటీసీ పురమాని రజాక్ యాదవ్, ఘన్‌పూర్ ఎంపీటీసీ గన్ను నర్సింహులు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె కాలంలో సైతం పనిచేశారని, వారి సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని మీదికొండ సర్పంచ్ నాగరబోయిన మణెమ్మ కోరారు. బీసీ బంధు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జనగామ రూరల్: మాట్లాడుతున్న అభిగౌడ్

జనగామ రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ అన్నారు. శనివారం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై కార్యకర్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి శిరీష, నియోజకవర్గ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

కొడకండ్ల: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదల సంక్షేమం, న్యాయం చేకూరుతుందని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని మైదంచెరువుతండా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంత్రి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. గిరిజనులంతా కాంగ్రెస్‌కు అండగా నిలిచి గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సిద్ధూ, సుధీర్, భీమాని, హేమాని, రవి, హరిచందర్, రాజేందర్, ఉపేందర్, వినోద్, సందీప్, గోపాల్, సుధాకర్, చందర్, దేవేందర్, సురేందర్, అనీల్ పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

జఫర్‌గఢ్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య అన్నారు. మండలంలోని సూరారం, హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్‌లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటా శనివారం ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, జిల్లా కిసాన్ సెల్ కోఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, నాయకులు ఇల్లందుల బాబు, శిరబోయిన శ్రీనివాస్, పాషా, మహేందర్, సందీప్, గోనే వెంకటేశ్వర్లు, ఎర్ర భిక్షపతి పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. ధర్మాపురం పరిధి సీత్యతండాలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ హయాంలో గిరిజనుల జీవనప్రమాణాలు పెంచేందుకు రిజర్వేషన్ కల్పించి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించారన్నారు. ప్రజాస్వామ్యయుత పరిపాలన అందించే కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు పార్టీ కార్యకర్తలు పాటుపడాలని కోరారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా గుగులోత్ ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ మోహన్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా భద్రు, కార్యదర్శిగా గుగులోత్ విజయ్, కోశాధికారిగా భూక్యా యాకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నర్మెట: మండలంలోని ఆయాగ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లను సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ బతుకమ్మ చీరలును, క్రీడల వైపు యువతను ప్రోత్సహిస్తూ క్రీడా కిట్లను అందించడం హర్షనీయమని అన్నారు. గత ప్రభుత్వాలు మాటలతోనే సరిపెట్టగా కేసీఆర్ చేతల మనిషిగా నిలుస్తున్నారని తెలిపారు. సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, జెడ్పీకోఆప్షన్ ఎండీ గౌస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

దేవరుప్పుల: బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర్ సూచించారు. శనివారం మండలంలోని పడమటితండా (డీ)లో ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరలను సర్పంచ్ జాటోత్ కౌంస్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన నాయకులు



జనగామ: పల్లాతో పట్టణ నాయకులు

జనగామ: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు పానుగంటి రోహిణి ఆధ్వర్యంలో 13వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్ అనురాగ్ యూనివర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. వార్డు ప్రతినిధులు పానుగంటి సువార్త, పానుగంటి ప్రవీణ్, మహిళ అధ్యక్షురాలు బొట్ల పుష్ప, సీస రాజు, నల్ల వినోద్, తోట సుభాష్, పులి సాయికృష్ణ, సుంచు సత్యమూర్తి, చెన్నోజు పూర్ణశేఖర్, తిప్పారపు ఉమేష్, శివసాయి, బక్క సునీల్, సాగర్, భాస్కర్, ఉమేష్, పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పలువురు మండల నాయకులు కలిసి పూల బొకేను అందజేశారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, జిల్లా సందీప్‌కుమార్, గందమల్ల నరేందర్, జావీద్, కర్ణాకర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, సతీష్‌కుమార్ ఉన్నారు.

కొనసాగిన ఈ–పంచాయతీ ఆపరేటర్ల దీక్షలు

జనగామ: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు జిల్లా కేంద్రంలో చేపట్టిన శాంతియుత దీక్షలు శనివారం తొమ్మిదోరోజు కొనసాగాయి. కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్, యుగంధర్, రమ్య, శ్రీకాంత్, నజీర్ మద్దతు పలికారు.

వైభవంగా వార కల్యాణం

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన అడె పు శ్రీనివాస్–సునీత, సంగీత–వైష్ణవి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పూజలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌కు ప్రభుత్వం జూనియర్ సివిల్ కోర్టును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ లీగల్‌సెల్ అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్ కనకం రమేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శనివారం డివిజన్ కేంద్రంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

అభినందనీయం

దేవరుప్పుల : ప్రభుత్వ పాఠశాలలలోని నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం విటెక్ సిస్టమ్ బృందం తోడ్పాటు అభినందనీయమని సర్పంచ్ రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విటెక్ సిస్టమ్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు కిరణ్‌శర్మ, సంజీవయ్య విభూతి తదితరుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట: పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం బోనకొల్లూర్ సర్పంచ్ అయిలు మల్లయ్య పంపిణీ చేశారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నెకు చెందిన పిట్టల భిక్షపతి అనారోగ్యంతో గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, గ్రామానికి చెందిన కోడూరు శివకుమార్ గౌడ్ ఆస్పత్రికి వెళ్లి రూ. 5 వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

రఘునాథపల్లి: రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్‌గా నియామకమైన ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంతాపం

నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డ పంచాయతీ కార్యదర్శి కానుగంటి సుకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, పంచాతీల సిబ్బంది మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బచ్చన్నపేట: తక్కువ వడ్డీకి రుణాలు అందించే బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ గురుప్రీత్ సింగ్ అన్నారు. శనివారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు.

పరామర్శ

రఘునాథపల్లి: కంచనపల్లిలో ఇటీవల విద్యుత్ స్తంభంపై కరెంట్ షాక్‌కు గురై సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కుల కిరణ్‌ను శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు.

కూలీలకు తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: వనపర్తిలో జరుగుతున్న న్యాక్ (భవన నిర్మాణ కార్మిక రంగం)లో శిక్షణకు వెళ్తున్న నేలపోగులకు చెందిన భార్యభర్తలు గైని రాజు, గైని రేణుక, మరో మహిళ కర్రె మున్నెమ్మ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జనగామ–సూర్యాపేట రోడ్డులో నేలపోగుల–వనపర్తి క్రాస్ రోడ్డు వద్ద నేలపోగుల నుంచి న్యాక్ శిక్షణకు బైక్‌పై పోతుండగా జనగామ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజుకు రెండు కాళ్లు, తలకు, రేణుక, మున్నెమ్మకు కాలు విరిగాయి. జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

కేసు నమోదు

చిల్పూరు: వెంకటేశ్వరపల్లెకు చెందిన ముగ్గురిపై దాడి చేసి గాయపర్చిన ఇద్దరిపై శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బోసు ఎల్లయ్య, శివరాత్రి వెంకటయ్య, శివరాత్రి సమ్మయ్య వ్యవసాయ పొలాల వద్ద శుక్రవారం పశువులను మేపుతుంటే పక్కపొలాలకు చెందిన కస్తూరి వెంకటేష్, రాజయ్యల మధ్య గొడవ జరిగింది. రాత్రి ఇంటికి వెళ్లి ముగ్గురు గొడవకు దిగడంతో పాటు వారిపై రాళ్లతో దాడి చేయడంతో ఎల్లయ్య తలకు తీవ్రంగా గాయం కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శనివారం 12 మంది లబ్ధిదారులైన యాదవులకు శనివారం రెండోవిడత గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి బి.మానిక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు.